

# బావ

బావఅంటే సర్వసామాన్యముగా పెళ్లాం సోదరుడనో, మేనత్త మేనమామల కొడుకనో అర్థం చేసుకుంటారు మగవాళ్లు. అలాగే భర్త సోదరుడనో మేనత్త మేనమామల కొడుకనో అనుకుంటారు ఆడవారు. బావ బాంధవ్యము తుమ్మబంక లాంటిది, అంటుకొంటే విడువదు అని అంటారు కొందరు పెద్దలు. అన్ని బంధువర్గాలకీ బావ చుట్టరికం మహా ఘనమైనదనీ, ఉత్కృష్టమైన దనీన్నీ, ఒక ఉన్నతోద్యోగి ఫాయివంటి ఫాయిలో గౌరవమర్యాదలు జరుగుతాయనీ, అతని మాటకు ఎదురు చెప్పడానికి ఎంతటి విద్వాంసులైనా, పండితులైనా, ధనవంతులైనా అధికారులైనా భయపడ్తారనీ, ఇతర బంధువర్గాలు, స్త్రీలోకమూ అసూయపడుతూంటాయి. పెద్దవారిలో వియ్యంకుడు మగపిల్లవాడున్నాయన బావ సంబంధ రీత్యా ధనార్జనకు వీలుగా వుంటుందని, పాత అప్పులు తీర్చుకోవచ్చునని ఆడపిల్ల కన్నాయనను అతి అప్యాయంగా భావగారూ అని అంటిస్తాడు. చిన్నపిల్లలు అతిముద్దుగా వస్తాడే, మా బావ-పాటలు పాడుకుంటూ హాయిగా ఆనందిస్తూంటారు. మరికొందరు బావఅంటే వినోదానికి సంబంధించిన వ్యక్తి అనీ అతనిపై కల్పిత ప్రహసనములు ప్రయోగించి నగుబాట్లుచేస్తూ ఆనందించడానికనువైన వస్తువని అంటారు. మరికొందరు బావ ద్వారానే - లోక కళ్యాణమునూ సకల జనశ్రేయోభిదాయకమైనదీ, సకల ప్రపంచమునకూ జ్ఞానమునిచ్చే గీతాబోధ జరిగినదనీన్నీ యీ బావ బాంధవ్యము ద్వారానే శ్రీ రాజగోపాలాచారి గారు గాంధీమహాత్మునకు సన్నిహిత బంధువుడు కాగల్గాడనీ తద్వారానే యిప్పటికిని అసమాన గౌరవ ప్రతిష్ఠలుకల్గి రాజ్యమేల గల్గుచున్నారనీ భావకవులఉపమానాలు తెస్తుంటారు. ఎలాగైతేనేమి బావబంధువర్గము మాత్రము యుగయుగాలనుంచీ ముఖ్య కార్యక్రమాలు కొనసాగించడానికి ఏర్పడిందని అనుకోవలసి వస్తుంది. యీ ప్రాధాన్యం గుర్తెరిగే కామోసు ఆలిండియా రేడియోవారు గ్రామస్థుల కార్యక్రమంలో యిద్దరు బావలద్వారా వార్తాసమీక్ష సూటిగా అందచేస్తున్నారు. సర్వజనామోదం కూడా పొందింది.

ఎందుకింత సన్నిహిత బాంధవ్యాలలో ఒకటిగా పరిగణింపబడుతోందని, బావలకి సంఘములో గౌరవము తగ్గించాలని అనుకుని సింహాచలపురము లోని మహిళలు సమావేశమై విమర్శించటానికి ఒక సభ ఏర్పాటు చేశారు. అనేకచోట్ల స్థాపితమవుతూన్న మహిళా సంఘాలవలె ఊక దంపు తీర్మానములు చేయడము కాకుండా తామొక నూతన పంథాలో దేశ ఔన్నత్యానికి పాటుపడి సంఘములో జరుగుతూన్న అవినీతిని దుర్మార్గమును అణచుటకు బద్ధకంకణములు కట్టుకున్న యీ మహిళలు వచ్చేవారం సభలో బావ చుట్టరికాన్ని గురించి సాకల్యంగా చర్చించాలని తీర్మానించారు. అనుకోవడం యేమిటి వెంటనే కరపత్రాలు అచ్చయాయి. పత్రికల్లో ప్రచురించారు. యితర ఊళ్లనుంచి ప్రతినిధులు వస్తా

లింగం అనసూయ

కేమోనని రిసెప్షను కమిటీ యేర్పాటుచేసి వారి వసతి, భోజన సౌకర్యాలకు తగు ఏర్పాట్లుకూడా పూర్తిచేశారు.

సింహాచలపురం అట్టే బస్తీగాదు. అలాగని బొత్తిగా పల్లెటూరు కాదు. యీ రెండింటికీ చెడ్డ గబ్బిలం జాతి ఊరు. ఆ ఊళ్లో పగలు కంటే రాత్రే ఎక్కువ ఆలజడి. ఆ ఊరికి ఆ పేరు ఎలా వచ్చిందో మనకు తెలీదు కాని ఆ ఊళ్లో సింహాలు లేవు. కొండ లంతకంటే లేవు. పోనీ పల్లెటూరిలోని ప్రశాంతనిరాడంబర జీవితములు, నిర్మలమైన పవిత్రప్రేమ ఉన్నాయేమో అంటే అవీ లేవుగాని పట్టణములలోని కలుషపూరితమైన ప్రేమ బాంధవ్యాలు, డాంబికములు, దగాలు, స్వార్థపరత్వము, వారిని ఆకర్షించి వారి అమాయిక హృదయాంతరాళముల్లో అశాంతి,నిరాశ, అసంతృప్తి విషయవాంఛ ఏర్పాటు చేస్తున్నాయి. పట్నములలోనుండే సౌకర్యాలు—మాటవరుసకి విద్యుచ్ఛక్తిగాని, నీరు సరఫరా చేసే కుళాయిలుగాని స్వేచ్ఛా విహారములకు పార్కులుగాని, సినిమాలుగాని, లేవనిమాత్రం ఆ ఊరి ప్రజలకు చాలా చిన్నతనముగా ఉన్నది. అయినప్పటికీ తరుచు పట్టణములందు యీ వినోదములకు ఆలవాటు పడ్డవారు దుస్తులలో నైతేనేమి, వేష భాషలలో నైతేనేమి వారిని అనుకరిస్తున్నారు. స్త్రీలయందీ మార్పు ఎక్కువగా గోచరించెడిని. దీనికి తార్కాణంగా ఆ ఊళ్లో మూడు గాజుల షాపులు, నాలుగు కళ్లద్దాల షాపులు రెండు రిస్టువాచీ షాపులు అయిదు ఫేన్సీగూడ్సు షాపులు వెలిశాయి.

తగిన ప్రచారం జరిగినందువల్ల చుట్టుప్రక్కల పట్నవాసపు స్త్రీ సంఘ సంస్కర్తలు చాలమంది వచ్చారు - పల్లెటూరి పడుచులవద్ద తమ నాగరికతను ప్రదర్శిద్దామని.

సభ అనుకున్న ప్రకారం సమావేశమైంది. ఊళ్లోవారు కూడా చాలామంది ఉన్నారు. కాకినాడనుంచి వచ్చిన నిత్యపుణ్యస్త్రీ యైన రాధాబాయమ్మగారిని అధ్యక్షురాలుగా ఏర్పాటుచేసి జాతీయ ప్రార్థనాగీతముతో ప్రారంభించారు.

నాంది ప్రస్తావనానంతరము శ్రీమతి రాధాబాయమ్మగారు తొలిపలుకులా బావ శబ్దము యొక్క వ్యుత్పత్త్యర్థములు ఆమెకు తెలిసినంత మట్టు కేకరవుపెట్టి, 'బావ అంటే మన్మథుడని అర్థముంది గనుక భర్తలను యితర బావలను అట్టి మన్మథునితో పోల్చి బావ అని సంతోషించెడు వారు మన పూర్వీకులు. దానిచే మనముకూడ విమర్శింపక గ్రుడ్డిగా అనుసరిస్తున్నాము. మన్మథుడు కేవలము అంధకార భూయిష్ఠమైన ప్రేమచే రగుల్కొల్పగల సమర్థత గలవాడు గనుక మన సర్వేశ్వరుడు అట్టివానిని భస్మము చేసియుండెను. ఆ మన్మథుడు ఈశ్వరునికి శత్రువు. ఈశ్వరుని దేహములో సగముగా పంచుకొనియందు వసించుచున్న మన జగదేక మాత పార్వతికికూడ అతడు శత్రువేకదా! అట్టివాడు స్త్రీజాతికంతకు శతువు కాడా! గాన మనకు యీ బావ లెంతమాత్రమునూ పూజ్యులు కారు. వారిని గౌరవించుట, పూజించుట, భూత పిశాచములను పూజించుటవంటిదని మనవి చేయుచున్నాను. మఱికొందరు -బా- అంటే తీగ-లత -స్త్రీ, వ-అంటే దాపించువాడు అని అర్థాలున్నాయి గనుక బావ అంటే స్త్రీని పెడదారులనుండి తప్పించి సంప్రదాయ విరుద్ధమైన పనులు చేయకుండగను ముండ్ల కంపయందు పడకుండా దాపించువాడు గనుక పూజనీయ శబ్దమని వాదింపవచ్చును. ఇది సరియైన విమర్శనము కాదు. పూర్వపు యుగములలో నట్లుండెడిది యేమో గాని యిప్పుడు పురుషులు స్త్రీని వంచించి పెడదారులు త్రొక్కించి, అధోగతి పాలు చేయుచున్నారు. తమ తుచ్ఛ కామము నెరవేర్చుకొనుటకై మనలో అవినీతిని ప్రబలచేసి ఎందరో శీలవతులను పాడుచేయుచున్నారు. స్త్రీల కష్టసుఖములను వారు పాటించరు. అట్టి వివేకహీనులైన మగజాతి నేల మనము పూజించవలయును?' అని ప్రస్తావించి ఊరుకుంది.

సన్నంగా పొడుగుగా ఉండి కోరజూపు మానే ఒక యువతి ఆవేశముతో సభావేదిక నెక్కి "అమ్మలారా, అక్కలారా, యీ రోజున మన అధ్యక్షులవారు బావలపై చేసిన వ్యాఖ్యానములు సమంజసములు కావు. బావలే లేనిచో ఈ సృష్టియే మిథ్య. వారు చాల ప్రశంసనీయులు, ఏలంటరేమో, బా అంటే నిర్మలమైనది వ అంటే సాత్త్వికుడు అని అర్థాలున్నాయి గనుక బావ

అంటే పరమ ధార్మిక స్వభావుడు అని గ్రహింపవలసియున్నది. మరియొక్క అర్థమేమిటంటే బా అంటే బూరుగుచెట్టు, వ అంటే వరుణుడు అని పెద్దలు చెప్తారు గనుక యీ రెండు అక్షరముల సంపుటియైన బావ శబ్దము వలన బూరుగుచెట్టువలన పండుకొనుటకు మెత్తని దూది యెట్లు లభ్యమగునో గాలిదేవుని వలన చల్లనిగాలి మండవలయము లేర్పడి ఉత్సాహవంతముగానుండునో అట్లే వీరివలన స్త్రీ జాతికి అత్యంత సేవ జరుగుచున్నదని నొక్కిచెప్పగలను. అధ్యక్షుల వారు బావలు మనలను పెదదారి నడిపించి అవినీతి ప్రబల చేయుచున్నారని మనలను కష్టపెట్టుచున్నారని నుడివిరి. అట్లనుట మనను మనమే అగౌరవపరచుకొనిన వారమగుదుము. స్త్రీ అరచేతిలో వైకుంఠమున్నదని అనుకొను యీ మగవారు మనలనా పెదదారుల త్రొక్కించగల సమర్థులు? స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః అని వారెరుగరా? పైవారు కోపముతో నున్నప్పుడు బావా అని సమ్మోహనాస్త్రము ప్రయోగించిన మనకు పాదాక్రాంతులు కారా? అట్టివారి నేల మనము బహిరంగముగా అగౌరవపరచవలెను." అనిఏమేమో చెప్పబోగా డౌను డౌను అని సభలో కేకలు చెలరేగినవి. చెప్పినది మఱచి ఆమె కూర్చున్నది.

పుణ్యస్త్రీగా పరిగణింప బడుతున్న పూర్వ సువాసిని యశోదమ్మగారు తరువాత అందుకున్నారు.

"మన అక్కగారు చెప్పినట్లు ఏపురుషునైనా బావా అని పిలిచామాఅంటే వాడు ఒళ్లు మరచిపోయి తానొక అవతార పురుషుడనుకొంటూ అతిగా ప్రవర్తిస్తాడు. ఈ ఘట్టము మనలో చాలమందికి అనుభవీ వేద్యమయినదే. గురివింద గింజకు తన నల్పు తెలియనట్లుగానే యీ పురుష లోకము చేయుచున్న అవినీతి పనులు వారికి తెలియుటలేదు. రోజురోజునకూ మితిమీరిపోవుచున్నవి. ఇవి అరికట్టవలసిన బాధ్యత మనపైననున్నది. మనలో చాలమంది బాధపడుచున్న విషయమొకటి సంగ్రహముగా ముచ్చటించి విరమిస్తాను. ఈ సభలో అవివాహిత స్త్రీలెంతమంది కలరు? దీనికికారణం బావలే కదా. (కాదుకాదు అని సభలో కేక) మగపిల్లలను కని సందకు గర్విస్తూ పెళ్లిఅనే వ్యాపారములో బహిరంగ వేలములు ప్రచారముచేసి ఆ వేలముకు పాటదార్లుగా వచ్చే వారి నందరిని ఒకొక్కరిని ప్రత్యేక సమయములందు లాలనలతో బుజ్జగిస్తూ బావగారూ, అని వాళ్లని హెచ్చరిస్తూ ఎక్కువపాట సొమ్ము గుంజడానికి యత్నిస్తూంటారు ఈ చిన్నబావల తండ్రులు. మన స్త్రీజాతి అంత నీచమైనదా? మనకు యుక్తవయస్సులు వచ్చునరికి మన తలితండ్రులకు క్లిష్ట సమస్యలు పరిస్థితులు కల్పిస్తున్నా మన్నమాట. మనలను గుదిబండలవలె చూచి ఎట్లయినను విడిపించుటకు ఎంత ధనవ్యయ ప్రయాసలకైనా లెక్కచేయక ఒకొక్కప్పుడు ఆత్మాభిమానమునుకూడా చంపుకొని బావాన్వేషణకై పాటుపడుచున్నారు. పడరాని యిక్కట్టులు అనుభవించుచున్నారు. యీమధ్యను మావూళ్లో ఒక యువతి కొంచెము అందము తక్కువగలది సుమారు యిరవై సంవత్సరాల ప్రౌఢకు సరియైన బావ దొరకనందుకు ఆమె తల్లిదండ్రులు తపస్సు చేసిచేసి ఎట్టకేలకు పదివేల రూపాయిలు సమర్పించి వివాహము చేసినారు. ఆ వివాహమైన తరువాత పిల్లను కన్నాయనకు పేదరికము సంభవించుటచే తనపై భగవంతుడింత కఠిన చర్య ఏల తీసుకొన్నాడని మంచము కూడ పట్టినాడట. ఇదంతయు ఆ కట్నఫలితమేకదా. ఈ మధ్యను మా సంఘమునకు పలుచోట్లనుండి కంప్లయింట్లు జోరుగా వచ్చుచున్నవి. ధరలెట్లు దినదినాభివృద్ధిగాంచుచున్నవో అట్లే కట్నములుకూడ వేలమీద జరుగుచున్నవట. ఇవి కూడ అడ్వాన్సుగా చెల్లించవలయునట. బేరము కుదురువరకు ఆడపిల్ల కన్నవారు విధి విరామము లేకుండా చిన్న బావను కని ధన్యుడైన తండ్రిచుట్టూ ప్రదక్షిణములు చేయవలసినదేనట. ఇదెక్కడి న్యాయమమ్మా! భగవంతుని సృష్టి లో అందరొక్కటే కదా! మగ పిల్లలకు యీ ఆధిక్యము ఏల వుండవలయును? యింతకునూ మన స్త్రీజాతి అంత పనికిరాని వాండ్రమనా యింతింత వరకట్నములిచ్చియూ, కాబోయే బావలచే ఎత్తి పొడుపు మాటలు, వేళాకోళములు సహించియూ, అప్పుల పాలగుచూ, మనలకు వివాహములు

చేసి యీ బావలకు మనయొక్కయూ, వారి యొక్కయూ ఆత్మ గౌరవముల మంటకల్పుచుండవలయునా! ఒకవైపు వరకట్నములు పుచ్చుకొనరాదని శాసనములు చేయించుటకు ఆందోళనలు జరుగుచున్ననూ చీకటి బజార్లగుండా విద్యార్థులు పెద్దవారుకూడా, యీ కట్నములను స్వీకరించుచున్నారు. యిది చీకటి బజారు యనుగమన్నారుగా.

ఇవి వరకట్నములు గావు. లంచములు. మగపిల్ల కన్నాయనకు ఆయన కుమారుడికి పెళ్లి చేయుటకు లంచమన్న మాట. వానిని పెంచి పెద్దవానినిగా చేసినందుకు లంచమన్న మాట. మన స్త్రీలను కని పెంచి పెద్దవారిగా చేసిన మన తండ్రులకు యిచ్చు అర్హతే గాని పుచ్చుకొను అర్హత లేదట ఏమి న్యాయము! చీకటి బజారు వేలములకు గురియై మన ఆత్మాభిమానమును చంపుకుంటామా? మనలను కని పెంచిన తలిదండ్రులకు తోడి సోదరులకును మన వివాహములను పేరిట దురంత దారిద్ర్య బాధను అప్పచెప్పగలమా? తెండు మేల్కొనుడు. పురుషుల ద్వారా బ్లాకుమార్కెటు నిర్మూలనము, సంఘసంస్కరణ ఒక్కనాటికి జరుగదని నేను ఘంటాపథముగా చెప్పగలను. వారు ఎంతసేపూ గదుల లోను, సభావేదికలమీద, ఆవేశముతో అభిప్రాయములను వెల్లడించువారే గాని కార్యశూరులుగారు. అందుచేతనే మన అధ్యక్షుల వారు తొలుదొల్తనే శలవిచ్చి యున్నారు- పురుష జాతి పూజనీయమైనది గాదని. గనుక నేటినుండి పెళ్ళికి పురుషులనమ్మి చీకటిబజారు అరికట్టవలసిన బాధ్యతకూడ మనము వహించవలయును.

ఇందుకు మొదట మన వివాహములతో మన తలిదండ్రులు జోక్యము కలుగచేసుకొనకుండ యత్నించవలయును. వివాహపు బావల తండ్రులు లంచములు లేనిదే వివాహము చేయమన్న వారిని నిరసించి వారియొక్క హింసాచర్యలను పత్రికలలోను, రేడియో ద్వారాయున్నూ ప్రజలందరికీ ఎరుకపర్చి వారిని సంఘము చులకనగా చూచునట్లు చేయవలయును. అంతకూ దారికి రాకపోతే ఏంటీ కరప్షను డిపార్టుమెంటు వారికి పట్టిచెప్తామని భయపెట్టాలి. ఇంకా వినక సిలపాలేసి మొండిపట్టు పట్టి భీష్మించుకుని చీకటిబజారులో అంటు పైకి తెలియకుండా క్రాసు చెక్కులు పెండ్లికి నెలరోజులు ముందుగానే అడ్వాన్సులు పుచ్చుకొంటే అట్టి వివాహములకు మనము వెళ్లక బహిష్కరించవలెను. లేదా శాంతియుతమైన సత్యాగ్రహము చేసియుం పెండ్లి కార్యక్రమము సాగకుండా పికెటింగు చేసియుం ఉభయవర్గాలవారికి కలవంపులు కలుగునట్లు చేయవలయును అని ముగించింది.

రాధాబాయమ్మగారు సభను ముగిస్తూ "యీ రోజున సంఘములో ముఖ్య బంధువర్గమైన బావను గురించి మనలో అవివాహిత స్త్రీల వలన వారి తల్లిదండ్రులకు కలుగుచున్న యిక్కట్టులు మన సోదరీలు చక్కగా మాట్లాడినారు. స్త్రీకి పూర్వయుగములందెక్కువ ప్రాధాన్య మివ్వబడింది. పురుషుని అనేక పరీక్షలు చేసినగాని వివాహములు చేసెడివారు కారు. స్వయంవరములను పేరిట ఒక స్త్రీని వివాహము చేసుకొనుటకు ఎటువంటి కష్టసమస్యలనెదుర్కొన వలసివచ్చేదీ మీరందరకు తెలిసినదేను. ద్రౌపదీ స్వయంవరమునకు మత్స్యయంత్రము కట్టలేదా? రాముడు సీతను పెండ్లాడుటకు శివ ధనస్సును ఏర్పాటు చేయలేదా? యింకనెన్నో పరీక్షలు గలవు. సుభద్రను వివాహము చేసుకొనుటకు అర్జునుడు ఎన్ని బాధలు పడినాడు. ఆఖరుకు సన్యాసికూడ అయినాడు. యిప్పుడో అట్లుగాదు. ఎదురు తిరిగింది కాలము స్త్రీని పరీక్ష చేయుచున్నారు. పెళ్లిచూపులకు వచ్చి ప్రతివారూ ఎగాదిగా చూచి నడిపించి మాట్లాడి సంగీతము పాడించి యింకా ఏమేమో పరీక్షలట. ఎందుకింత హంగామా! మనము వారికంటెకి చులకనగా కనపడుట చేతనే గదా. యిట్టి అవమానమైన పనులు జరుగకుండ తగు కట్టుబాట్లు చేసుకోవాలి మనము. మనమే పురుషులను పరీక్ష చేయనధికారము ముంచుకో వలెను" అని గంభీరంగా సెలవిచ్చారు.

సభ దిగ్విజయంగా ముగిసింది. తిరిగి ఎవరి ఊళ్ళకి వాళ్లు వెళ్లిపోయారు. తమ మామ బావలను చూసిన తరవాత సభలోని తీర్మానాల సంగతే మరిచిపోయారు. బావను మించిన అమూల్య వస్తువీ ప్రపంచంలో యింకేదీ లేదనుకున్నారు.



**అఖిల** భారత పత్రికా సంపాదకుల సమావేశపు అధ్యక్షుడు శ్రీ సి. ఆర్. శ్రీనివాసన్ కెనడాలో జూన్ ౨ నుండి జరుగబోయే ఇంపీరియల్ ప్రెస్ కాన్ఫరెన్సుకు ఇండియా తరఫు ప్రతినిధిగా వెళ్లారు. ఆయనకు మద్రాసు విమానాశ్రయం వద్ద వీడ్కోలు యిస్తున్న దృశ్యం.

**(ఎడమ నుండి కుడికి): శ్రీయుతులు సి. ఆర్. శ్రీనివాసన్, ఖాసా సుబ్బారావు, కస్తూరి శ్రీనివాసన్ చిత్రంలో కానవగును.**